ايمان بالرسالة

3

# దైవదౌత్యంపై విశ్వాసం

ముహమ్మద్ ఇనాముల్లాహ్ ఉమరీ
(అధ్యాపకులు: మర్కజ్ దారుల్‌బిర్, పెడన)

అనువాదం
నఫీసా అహ్మదీయ

ప్రకాశకులు :

MARKAZ DARULBIR

మర్కజ్ దారుల్‌బిర్
అహ్మద్ నగర్, పెడన, ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 08672 200003, 9912193013.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# దైవ దౌత్యంపై 'విశ్వాసం'

## 'నబీ' అంటే

అరబీ నిఘంటువు ప్రకారం 'నబీ' అనే పదానికి అర్థం **"భూమిలో ఎత్తైన భాగంలో ఉండే గుర్తు"**. దీని ద్వారా ప్రజలు దారిని తెలుసుకోగలరు, ప్రదేశాన్ని గుర్తించగలరు.

ప్రవక్తను 'నబీ' అని ఎందుకంటారంటే అతను సృష్టి రాశులన్నింటిలో కెల్లా ఉన్నత స్థానాన్ని కలిగి ఉంటాడు. (లిసానుల్ అరబ్) మరియు అతని ద్వారానే ప్రజలకు సన్మార్గం లభిస్తుంది. వారు మార్గదర్శనం పొందిన వారవుతారు.

## 'రసూల్' అంటే..?

అరబీ నిఘంటువులో **క్రమం తప్పకుండా ఒక వార్త తరువాత మరో వార్తను అందించే వారిని** 'రసూల్' అంటారు. ప్రవక్తను 'రసూల్' (సందేశహరుడు) అని ఎందుకు అనబడిందంటే ఒక సందేశహరుని తరువాత మరో సందేశ హరుడు వస్తాడు. రెండవ సందేశహరుని తర్వాత మూడవ సందేశహరుడు. ఇలా ఒకరి తరువాత ఒకరు సందేశహరులు రావడాన్ని బట్టి వారిని 'రసూల్'గా వ్యవహరించటం జరిగింది. ఇలా చివరిగా ప్రవక్త ముహమ్మద్ (స) వరకూ ప్రవక్తలు వస్తూనే ఉన్నారు. ముహమ్మద్ (స) చివరి ప్రవక్త, ఆయన (స) తరువాత మరే ప్రవక్తా రారు.

## 'నబీ' - 'రసూల్'లో భేదం :

ప్రతీ 'రసూల్' 'నబీ' కాగలడు. కాని ప్రతీ 'నబీ' 'రసూల్' కాలేడు. దీనిలో కొన్ని సాధారణ, ప్రత్యేక భిన్నాంశాలున్నాయి. అవి :

'రసూల్' అంటే : స్థిరమైన గ్రంథం, స్థిరమైన ధర్మశాస్త్రం కలిగి ఉంటారు. కాని 'నబీ' తన పూర్వం వచ్చిన ప్రవక్తల శాస్త్రాన్ని పునరుద్ధరించి, దానినే ఆచరణలోనికి తీసుకొస్తారు.

## ప్రవక్తల ప్రత్యేకతలు :

ప్రవక్తలు మానవుల్లో ఉన్నతులై కొన్ని ప్రత్యేకతలు కలిగి ఉంటారు. అవి ఇతరుల్లో ఉండవు. అవేమంటే :

1. ప్రవక్తలు శ్రేయోభిలాషులై ఉంటారు. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

"నా ప్రభుపు సందేశాలను మీకు చేరవేసేవాణ్ణి, మరియు నమ్మదగ్గ మీ శ్రేయోభిలాషిని". (అల్-ఆరాఫ్ : 68)

ఎలాంటి స్వార్ధపూరిత ఉద్దేశం లేని స్వచ్ఛమైన శ్రేయోభిలాష ప్రవక్తల్లో ఉంటుంది. ఎలాంటి ప్రాపంచిక ఉద్దేశ్యాలుగానీ, పదవీ వ్యామోహంగానీ, సిరిసంపదలు, అధికార దాహంగానీ వారిలో ఉండవు. మానవుల ఇహ, పరలోక సాఫల్యం కొరకు, నరకాగ్ని నుండి విముక్తి కొరకు వారు పరితపిస్తారు.

2. ప్రవక్తలు మరియు సందేశహరులు ఉత్తమ నడవడిక, ఉన్నత లక్షణాలు కలిగి ఉంటారు. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

"ఓ ప్రవక్తా! (స) నిస్సందేహంగా మీరు నైతికంగా అత్యున్నత స్థానంలో ఉన్నారు". (అల్- ఖలమ్)

3. ప్రవక్తలు మరియు సందేశహరులు హెచ్చరించేవారు (భయపెట్టేవారు), శుభవార్తను తెలిపేవారై ఉంటారు. మంచిని ఆచరించి, చెడును నిర్మూలించే వారికి ఇహపరాలలో విజయం, సాఫల్యం పొందే శుభవార్తను ప్రవక్తలు అందిస్తారు. మరియు నరకాగ్ని నుండి, దాని శిక్షల నుండి భయపెడతారు.

4. నిరుపేదలు, అగత్యపరులు, అనాధలకు అండగా నిలుస్తారు.

ప్రవక్తలందరికీ ఏదో ఒక విశిష్ఠత ఉంటుంది. హజ్రత్ ఇబ్రాహీం (అ) గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది:

"నిస్సందేహంగా ఆయన ఒక సత్యవంతుడైన ప్రవక్త". (మర్యమ్ :41)

ప్రవక్త ఇస్మాయిల్ (అ) గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది :

"నిస్సందేహంగా ఆయన వాగ్దానంలో సత్యవంతుడు మరియు ప్రవక్త సందేశహరులు". (మర్యమ్: 54)

ప్రవక్త మూసా (అ) గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది :

"నిస్సందేహంగా ఆయన నిష్కపటుడు మరియు ప్రవక్త సందేశహరులు"

ప్రవక్త ఇద్రీస్ గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది :

"నిస్సందేహంగా ఆయన సత్యవంతుడైన దైవప్రవక్త ".

ప్రవక్త అయ్యూబ్ (అ) గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది :

"నిస్సందేహంగా మేము ఆయనను ఓర్పు సహనం వహించే వారిలో పొందాము". (స్వాద్ : 44)

ప్రవక్త ఈసా (అ) ప్రత్యేకత ఏమిటంటే అల్లాహ్ ఆయనను తండ్రి లేకుండానే సృష్టించాడు. మరియు అంతిమ ప్రవక్త (స) కు అనేక ప్రత్యేకతలున్నాయి. వాటిలో కొన్నింటిని మీ ముందుకు తీసుకురావటం జరుగుతుంది.. ఇన్షా అల్లాహ్!

## "వజ్ర సంకల్పులైన ప్రవక్తలు" :

పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథంలో మొత్తం 25 మంది ప్రవక్తల పేర్లు, వారి కాలానికి సంబంధించిన సంఘటనలు, గాథలు వివరించబడ్డాయి. వారిలో అయిదుగురు ప్రవక్తలను 'వజ్రసంకల్పులైన ప్రవక్త'లంటారు. వారే :

1. నూహ్ అలైహిస్సలాం
2. ఇబ్రాహీం అలైహిస్సలాం
3. మూసా అలైహిస్సలాం
4. ఈసా అలైహిస్సలాం
5. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)

పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

"ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకోండి! మేము ప్రవక్త లందరి నుండి వాగ్దానం తీసుకున్నాము. (ముఖ్యంగా) నీ నుండి, నూహ్(అ)నుండి, ఇబ్రాహీం (అ)నుండి, మూసా(అ)నుండి, 'మర్యమ్' కుమారుడైన 'ఈసా' (అ)నుండి. మేము వారందరి నుండి గట్టి వాగ్దానం తీసుకున్నాము". (అల్-అహ్‌జాబ్ : 7)

పై వాగ్దానం ప్రవక్తలందరి నుండి తీసుకోబడింది. కానీ ఇక్కడ ప్రత్యేకంగా ఐదుగురు ప్రవక్తల పేర్లు ప్రస్తావించబడ్డాయి. తద్వారా వారి ప్రత్యేకత, ప్రాముఖ్యత స్పష్టమవుతుంది. వారిలోనూ మహా ప్రవక్త (స) ప్రస్తావన ఆరంభంలోనే ఉంది. చూడబోతే దైవదౌత్య పరంగా ప్రవక్త (స) చిట్టచివరి ప్రవక్త. కానీ ఆయన(స) కు అందరి కంటే అరుదైన స్థానం లభించింది.

## చిట్టచివరి ప్రవక్త (స) ప్రత్యేకతలు :

అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స)కు మరే ఇతర ప్రవక్తలకూ లభించనటువంటి ప్రత్యేకతలు లభించాయి. వాటిలో కొన్ని ప్రత్యేకతల్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాము.

దైవ ప్రవక్త (స) ప్రవచించారని హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించారు :

"నాకు పూర్వం ఎవరికీ ఇవ్వబడని ఐదు వస్తువులు (విషయాలు) నాకు ప్రసాదించబడ్డాయి: అవి :

1. ప్రతి ప్రవక్త ఒక జాతివైపే పంపించబడ్డారు, కానీ నేను ప్రతి తెల్లవాని, నల్లవాని (సమస్త భూలోక ప్రజల) కొరకు పంపబడ్డాను.
2. యుద్ధప్రాప్తి (గనీమత్) నా కొరకు ధర్మ సమ్మతం చేయబడింది. నాకంటే పూర్వం అది ఎవరికీ సమ్మతం చేయబడలేదు.
3. సమస్త భూభాగం నా కొరకు 'సజ్దా' చేసే స్థలంగా (నమాజ్ చేసే స్థలంగా), శుచిశుభ్రతల సాధనంగా చేయబడింది. ఇక ఎవరికి (ఎక్కడ) నమాజు సమయం ఆసన్నమైతే (అక్కడే) నమాజ్ చేసుకోవచ్చు.

4. ఒక మాసపు ప్రయాణదూరంలో ఉండే శత్రువులు కూడా భయపడేటట్టు శక్తిని అల్లాహ్ నాకు ప్రసాదించాడు.

5. (ప్రళయ దినాన) నాకు 'సిఫారసు' చేసే అనుమతి ఇవ్వబడింది".

## 2. ప్రవక్త (స) సమాజం పూర్వ సమాజాల్లో కెల్లా శ్రేష్ఠ మైనది

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

**"మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన శ్రేష్ఠ సమాజం మీరు".**

***(ఆలి ఇమ్రాన్ :110)***

3. ప్రవక్త (స) ప్రత్యేకతల్లో మరో ప్రత్యేకతేమిటంటే ప్రవక్త (స)కు అసత్య వాక్యాలు, కల్పిత వాక్యాలు ఆపాదించడం నిషేధించబడింది. ఇది కఠినమైన పాపం, మరియు ఘోరాతి ఘోరమైన పాపం. ఇది దాని బాధ్యులను నరకాగ్నికి చేర్చుతుంది.

అబూహురైరా (రజియల్లాహు అన్హు) కథనం : అంతిమ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు :

**"ఎవరైతే ఉద్దేశపూర్వకంగా (కావాలనే) తెలిసి కూడా నా పై అసత్యం మోపుతారో వారు తమ నివాసం నరకంలో ఏర్పాటు చేసుకోవాలి".** (బుఖారీ, ముస్లిం)

కాబట్టి ఏ విషయాన్నైనా ప్రవక్త (స) కు అంటగట్టే ముందు దానిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. ప్రామాణిక ఉల్లేఖనాలుంటేనే ఇతరులకు తెలపాలి, లేదా వాటి నుండి దూరంగా వుండాలి.

## దైవ సందేశం, దైవ దౌత్య సమాప్తిపై విశ్వాసం

ప్రవక్త (స) ప్రళయం వరకూ వచ్చే సమస్త మానవాళి కొరకు ప్రవక్తగా పంపబడ్డారు. ఇక ముహమ్మద్ ప్రవక్త (స) తరువాత మరే ప్రవక్తా రారు. ముహమ్మద్ ప్రవక్త (స) యావత్తు మానవులకు సన్మార్గం తెలపడానికి పంపబడ్డారు. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

**"ఓ ముహమ్మద్(స)! మేము నిన్ను సమస్త జనులకు శుభవార్తను అందజేసే వానిగా, హెచ్చరించే వానిగా చేసి పంపాము. అయితే జనులలో అధికులకు ఈ విషయం తెలియదు".** ***(సబా :28)***

మరో చోట అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

**"ఓ ముహమ్మద్ (స)! వారికి చెప్పండి. 'ఓ ప్రజలారా..! నేను అల్లాహ్ తరపున మీ అందరి వద్దకు పంపబడిన ప్రవక్తను". *(అల్-ఆరాఫ్ 158)***

మరోచోట అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

**"ప్రజలారా..! ముహమ్మద్ (స) మీ పురుషుల్లో ఎవరికీ తండ్రి కాదు.**

**అయితే ఆయన అల్లాహ్ సందేశహరుడు, ప్రవక్తల పరంపరను పరిసమాప్తపరిచే (చివరి) వాడు. *(అల్-అహ్‌జాబ్ :40)***

## "ఖాతమ్"

**"ఖాతమ్"** అంటే సీలు 'ముద్ర'. ఏదైనా పనికి అంతిమంగా సీలు వేయడం జరుగుతుంది. ఈ పదం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు ఉపయోగించబడిందంటే ముహమ్మద్ ప్రవక్త (స)పై దైవదౌత్యం సమాప్తం చేయబడిందని అర్థం. ప్రవక్త (స) తరువాత ఎవరైనా తనను ప్రవక్తగా ప్రకటించుకుంటే అతను ప్రవక్త కాజాలడు. పైగా అతడు అబద్ధాలకోరుగా, వంచకుడుగా, దైవదౌత్యాన్నే అవమానించినవాడుగా, దజ్జాల్‌గా పరిగణించ బడతాడు. హదీసుల్లో కూడా ఇదే విషయం తెలుపబడింది, యావత్తు ముస్లిం సమాజంలో దీనిపై ఏకాభిప్రాయం ఉంది.

ప్రతి విశ్వాసికి తప్పనిసరైన విషయం ఏమిటంటే అల్లాహ్‌ను విశ్వసించేటప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను కూడా విశ్వసించాలి. ఎందుకంటే కలిమాలో రెండు భాగాలున్నాయి. ఒకటి :

" లా యిలాహ ఇల్లల్లాహ్" (తౌహీద్ సాక్ష్యం)

మరో భాగం :

"ముహమ్మదుర్ రసూలుల్లాహ్" (దైవ దౌత్యపు సాక్ష్యం).

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించని వారు అవిశ్వాసులే. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

> **"ప్రజలారా..! మీ వద్దకు మీ ప్రభువు తరపు నుంచి ప్రవక్త సత్యం తీసుకువచ్చాడు. కాబట్టి మీరు విశ్వసించండి. అది మీకే మేలు. ఒకవేళ మీరు గనుక తిరస్కరిస్తే ఆకాశాలలో భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే (అని తెలుసుకోండి). అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేక వంతుడు." *(అన్- నిసా :170)***

ఒకవేళ ఎవరైనా అల్లాహ్, ఆయన ప్రవక్తను విశ్వసించకుండా అవిశ్వాసానికి పాల్పడితే మీ అవిశ్వాసంతో అల్లాహ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లదు. మనిషి సన్మార్గం పొందితే అది అతనికే మేలు, లాభం.

అల్లాహ్ మనందరికీ దైవదౌత్య వాస్తవికతను గ్రహించి దానిని విశ్వసించి, దౌర్జన్యపరుల అసత్యఆరోపణల నుండి దైవదౌత్యమును కాపాడే భాగ్యాన్ని ప్రసాదించు గాక! ఆమీన్ !

మరిన్ని వివరాలకు సంప్రదించండి

MARKAZ DARULBIR

Ahmed Nagar, PEDANA - 521366

Krishna Dist. A.P. Ph : 08672 200003, 9912193013